రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి జయలలిత 68వ పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో తమకు తోచిన కార్యక్రమాలు నిర్వహించారు. కేకులు, మిఠాయిలు పంచడం, అన్నవస్త్రదానాలు, ఆలయాల్లో పూజలు, హోమాలు ఇలా ఎవరికి వారు అమ్మ దృష్టిలో పడడానికి తంటాలు పడ్డారు. కొందరు విభిన్నంగా జయలలిత బొమ్మలను పచ్చబొట్లుగా పొడిపించుకున్నారు.

-చెన్నై, న్యూస్‌టుడే



ఆర్కాడులో 1500 కిలోల భారీ కేక్


మిఠాయిలు పంచుతున్న మంత్రి వలర్మతి


మహిళా విభాగం ఆధ్వర్యంలో వృద్ధులకు చీరల పంపిణీ

అందులో భాగంగా రాయపేటలో ఉన్న అన్నాడీఎంకే పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రి పన్నీర్ సెల్వం ఆధ్వర్యంలో జయలలిత పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు.


జయ బ్యాడ్జీలతో కార్యకర్త


సైకిలుపై స్టిక్కర్లతో ఓ అభిమాని


ఒళ్లంతా రంగులతో...


బుల్లి ఎంజీఆర్...


ఇదిగో 'అమ్మ' ప్రతిరూపం... చేతులపై పచ్చబొట్లు

# ఫ్రెంచ్ క్షిపణి సంస్థతో వేల్‌టెక్ ఒప్పందం

**టీనగర్, న్యూస్‌టుడే:** ఫ్రెంచ్ క్షిపణి సంస్థతో వేల్‌టెక్ యూనివర్శిటీ ఓ సహకార ఒప్పందం కుదుర్చుకుంది. వేల్‌టెక్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన ఇడాడ్ 20016 (ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నొవేటివ్ డిజైన్, అనాలిసిస్, డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ ఏరోస్పేస్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్) సదస్సు సందర్భంగా వేల్‌టెక్ డాక్టర్ ఆర్.ఆర్, డాక్టర్ ఎస్ఆర్ టెక్నికల్ యూనివర్శిటీకి, ఫ్రాన్స్‌కు చెందిన ఎంబీడీఏ మిస్సైల్ సిస్టమ్స్, ఫ్యూచర్ సిస్టమ్స్‌కు మధ్య ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ రంగరాజన్, ఫ్రెంచ్ సంస్థ డైరెక్టర్ ఆలివర్ లూకాస్‌లు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రోఛాన్సలర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గడచిన ఐదేళ్లుగా తమ రెండు సంస్థలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఏటా పదిహేను మంది వేల్‌టెక్ విద్యార్థులు ఎంబీడీఏ సంస్థ మార్గదర్శకత్వంలో ప్రాజెక్టులు చేపడుతున్నారన్నారు. కొత్తగా వేల్‌టెక్ విద్యార్థులకు ఆ సంస్థ ఉద్యోగుల సహకారం, యూజీ, పీజీ స్థాయిల్లో ఉమ్మడి పర్యవేక్షణలో ప్రాజెక్టులు చేపట్టడం, ఉమ్మడి పర్యవేక్షణలో పీహెచ్‌డీ థీసిస్ తయారు చేయడం, వేల్‌టెక్‌లో జరిగే సదస్సులకు ఆ సంస్థ ఉద్యోగుల కృషి లాంటి వాటికి సంబంధించిన అంశాలను ఈ సహకార ఒప్పందంలో పొందుపరిచామని తెలిపారు. అంతకు ముందు ఇడాడ్ 2016 సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై, సదస్సును ప్రారంభించిన ఆలివర్ లూకాస్ మాట్లాడుతూ ఎంబీడీఏ నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాల గురించి, అవలంబిస్తున్న, అభివృద్ధి చేసిన వివిధ సాంకేతిక పరిజ్ఞానాల గురించి, విద్యార్థులకు వివరించారు. నవ్యావిష్కరణ, ఉమ్మడి భాగస్వామ్యాల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఈ సదస్సుకు సంబంధించి విడుదల చేసిన సావనీరు తొలి ప్రతిని ఫ్రెంచి రాయబార కార్యాలయంలోని శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన సలహాదారు డాక్టర్ ఫిలిప్ ఆర్‌హెట్స్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య కార్యకలాపాలలో భాగస్వామ్యం మరింత పెరగాల్సి ఉందన్నారు. తమ దేశంతో భాగస్వామ్యం ఏర్పరచుకునే దిశగా వేల్‌టెక్ సాధించిన విజయాలను ఆయన అభినందించారు. మూడు ప్లీనరీ సెషన్లతో కూడిన ఈ సదస్సు సందర్భంగా 13 కీలక ప్రసంగాలు అందగా, 54 అధ్యయన పత్రాలను సమర్పించారు. ప్రపంచం నలుమూలల నుంచి విఖ్యాత శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సదస్సుతో పాటు విద్యార్థుల నవ్యావిష్కరణ సామర్థ్యాలను పరీక్షించేలా జాతీయస్థాయి ప్రాజెక్టు కాంపిటీషన్, ఎగ్జిబిషన్‌లను నిర్వహించారు. దేశంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఈ పోటీ కోసం 120కి పైగా ప్రాజెక్టులను తయారు చేసి, ప్రదర్శించారు. ప్రముఖ పరిశోధన సంస్థలు, పరిశ్రమకు చెందిన నిపుణుల బృందం ఆ ప్రాజెక్టులను పరిశీలించి, మదింపు వేసింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఫౌండర్ ప్రెసిడెంట్ శకుంతలా రంగరాజన్, వైస్ ఛాన్సలర్ బీలా సత్యనారాయణ తదితరులు కూడా పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రంగరాజన్, ఆలివర్ లూకాస్

## పీఎంకే ప్రచార సీడీ విడుదల

**చెన్నై, న్యూస్‌టుడే:** పాట్టాలి మక్కల్ కట్చి(పీఎంకే) ఎన్నికల ప్రచార సీడీ విడుదల కార్యక్రమం నగరంలో బుధవారం జరిగింది. కార్యక్రమంలో పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి అన్బుమణి రామదాసు పాల్గొని ప్రచార సీడీని విడుదల చేశారు. సీడీ తొలి ప్రతిని ఓ ఆటో డ్రైవరు అందుకున్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులు, చిరువ్యాపారులకు ఈ సందర్భంగా అన్బుమణి సీడీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్లమెంటు మాజీ సభ్యుడు ఏకె.మూర్తి, పార్టీ న్యాయవాది బాలు తదితరులు పాల్గొన్నారు.


ప్రచార సీడీని విడుదల చేస్తున్న అన్బుమణి

## సత్తా చాటిన 'చంద్రశేఖరేంద్ర' విద్యార్థులు

**కాంచీపురం, న్యూస్‌టుడే:** త్రోబాల్, వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతులను సాధించి చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయ విద్యార్థులు సత్తా చాటారు. వారిని వర్సిటీ ప్రతినిధులు అభినందించారు. ఇటీవల చెన్నై, వేలూరులో జాతీయ స్థాయి త్రోబాల్ (బాలికలు), వాలీబాల్ (బాలురు) పోటీల్లో ప్రథమ స్థానాన్ని వర్సిటీ విద్యార్థులు సాధించారు. అభినందన కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి విష్ణుపోత్తి, రిజిస్ట్రార్ జి. శ్రీనివాసు, ప్రధాన పాలనాధికారి జి. రామచంద్రన్, శిక్షకులు ఎస్. పశుపతి కుమార్, ఎ.గుణాలన్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థులతో వర్సిటీ ప్రతినిధులు


ఈనాడు
దినపత్రిక కావలసిన వారు
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
చెన్నై ఆఫీసు
97910 - 83205 /
97910 - 74993/
Fax: 044-2827 5542
eenadu.circhn@gmail.com
దినపత్రికలో ప్రకటనలు
(అడ్వర్టైజ్‌మెంట్) కొరకు
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు
044-28232390
ప్రియమైన పాఠకులారా ! తమిళనాడు మినీపై మీ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు అందజేయగలరు. మీ ప్రాంత సమస్యలనూ తెలియజేయగలరు. మా మెయిల్ ఐడి:
eenadupress@gmail.com
Contact: 044 - 2826 4189
Office: C-10, Parsn Manere,
602 Anna Salai, Chennai 600 006